గ్రామీణ రోడ్లకు మహర్దశ

- గ్రామీణాభివృద్ధి శాఖ నిధుల నుంచి రూ.48.70కోట్లు మంజూరు
- బీటీగా మారనున్న 26 గ్రామీణ రోడ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మునుగోడు : నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల రోడ్లకు త్వరలో మహర్దశ పట్టనుంది. ఇప్పటి వరకు ఆయా గ్రామాలకు సరైన రోడ్లు లేక ఉన్న కంకర రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగించేవారు. కాని ఇప్పుడు నిధుల మంజూరుతో పలు గ్రామాల ప్రజలకు ఆ రోడ్డు కష్టాలు తప్పనున్నాయి. కంకర రోడ్లను పక్కా బీటీ రోడ్లుగా మార్చేందుకు అవసరమైన నిధులు ఇటీవల ప్రభుత్వం మంజూరు చేయడంతో ఆ పనులు త్వరలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా బీటీ పనులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని వేడుకుంటున్నారు.



బీటీరోడ్డుగా మారనున్న గుండ్లోరిగూడెం గ్రామపంచాయతీ రోడ్డు

26రోడ్లకు రూ.48.70కోట్లు మంజూరు..

నియోజకవర్గంలోని నల్లగొండ జిల్లా పరిధిలోని నాలుగు మండలాలకు మొత్తం 26రోడ్లకు రూ.48.70కోట్ల నిధులు ప్రభుత్వం వారం రోజుల క్రితం మంజూరు చేసింది. అందులో మునుగోడు మండలంలోని 11రోడ్లకు రూ.20.48 కోట్లు, చండూరు మండలంలోని 9 గ్రామాల రోడ్లకు రూ.5.31కోట్లు, మర్రిగూడ మండలంలోని 3రోడ్లకు రూ.5.80కోట్లు, నాంపల్లి మండలంలోని 3రోడ్లకు రూ.5.31 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో పలు నూతన గ్రామ పంచాయతీల రోడ్లతో పాటు వివిధ గ్రామాల లింక్ రోడ్లు సైతం బీటీ రోడ్లుగా మార్చేందుకు అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. అంచనాలు పూర్తయిన వెంటనే ఆ పనులు చేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ల చేత రోడ్డు నిర్మాణ పనులు వేగవతంగా చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన ఆయా గ్రామాల ప్రజలు ఎంతో కాలం తరువాత తమకు బీటీరోడ్డు వస్తుండడంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

నిధుల మంజూరు హర్షణీయం



మా గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడేవాళ్లం. మా గ్రామానికి పక్కా బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుండని ఆశపడ్డాను. నా ఆశ నేరవేరుతూ ఇటీవల ప్రభుత్వం మా గ్రామానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది.

– జంగిలి నాగరాజు, గుండ్లోరిగూడెం

20రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి

డివిజన్ పరిధిలో మొత్తం 26పనులకు రూ.48.70కోట్లు గత వారం రోజుల క్రితం నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు చేసేందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేస్తున్నాం. అవి పూర్తి కాగానే వెంటనే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లతో పనులు మొదలు పెట్టిస్తాం. మరో 20రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయిస్తాం.

– రఘుపతి, డీఈ పంచాయతీరాజ్

ఐకాన్ ఆస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు



మాట్లాడుతున్న కార్డియాలజిస్టు రవిశంకర్‌కన్నా, పక్కన వైద్యుల బృందం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ఆర్టీసీకాలనీ, విద్యానగర్‌లో గల ఐకాన్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నట్లు కార్డియాలజిస్టు డాక్టర్ రవిశంకర్ కన్నా తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గుండె సమస్యలు వస్తే హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు జిల్లా ప్రజలకు అందుబాటులో గుండె వైద్యసేవలను అందించాలన్న లక్ష్యంతో అత్యాధునిక పరికరాలతో కూడిన కార్డియాలజీ విభాగాన్ని ప్రత్యేకంగా ఐకాన్ ఆస్పత్రిలో నెలకొల్పామన్నారు. ఆస్పత్రిలో తమతో పాటు న్యూరోసర్జన్ శశాంక కోడె, నరాల వైద్య నిపుణురాలు సాయిమౌనిక చెరుకూరి, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు వై.శశీంద్ర, ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణుడు బచ్చు రాజేంద్రప్రసాద్ , క్రిటికల్ కేర్, కార్డియాక్ అనస్తీసియా డాక్టర్ సాయిలావణ్య కడిమి వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో అత్యంత ఆధునాతనమైన లామినార్ ఎయిర్‌ఫ్లో ఆపరేషన్ థియేటర్, ఆపరేటింగ్ మైక్రోస్కోప్, కేథ్‌ల్యాబ్, సిటీస్కాన్, ఎండోస్కోపి, కొలనోస్కోపి, 2డి ఎకో, టీఎంటీ, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పేదలకు కూడా మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్య శ్రీ సేవల కింద గుండె చికిత్సలు, స్టంట్లు, ఓపెన్ హార్ట్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, పొట్ట, పేగు ఆపరేషన్లు, ఎముకలు, కీళ్ల చికిత్సలు, ప్రమాదంలో గాయాలకు వైద్యం అందిస్తున్నామన్నారు. గడిచిన 24గంటల్లో తమ ఆస్పత్రికి గుండెపోటుతో వచ్చిన నలుగురికి సకాలంలో పరీక్షలు నిర్వహించి స్టంట్‌లను వేసి విజయవంతంగా వైద్యం అందించామన్నారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు, ఈహెచ్‌ఎస్, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఆయన వెంట మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి జెడ్పీ పాఠశాలలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు కంపెనీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జాహ్నవి, అంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం లగిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అనిల్‌రెడ్డి, సాయికుమార్, నగేష్, సువర్చలాదేవి, ఉస్మాన్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

చండూరు : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశం ప్రారంభంలో సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ పల్లె కళ్యాణి ప్రకటించారు. 11మంది ఎంపీటీసీలకుగాను పుల్లెంల ఎంపీటీసీ మృతి చెందడంతో 10మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సమావేశానికి 9మంది పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో చివరికి ఆదివారం 11గంటలకు సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఎంపీపీ పల్లె కళ్యాణి, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, తహసీల్దార్ అర్చనారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దీక్షకు తరలిరావాలి



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

మునుగోడు : గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన దీక్షకు తరలిరావాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ కోరారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు దీక్షకు సంబంధించిన కరపత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోమగోని సతీష్, ఉపాధ్యాయులు చంద్రిక, కవిత, అనిత, రమాదేవి, శిరీష, రెహానా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్



ఇస్మాయిల్‌పల్లిలో ట్రాక్టర్ నడుపుతూ చెత్త సేకరిస్తున్న సర్పంచ్ అంజయ్య

కట్టంగూర్ : మండలంలో పారిశుద్ధ్య కార్మికులు 10రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టడంతో ఆయా గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. దీంతో మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామ సర్పంచ్ పులిగిళ్ల అంజయ్య తానే ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట ఉపసర్పంచ్ జాల అంజనేయులు, పెంజర్ల కృష్ణకుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వమే కాపాడాలి

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే నెపంతో మూసివేయడం సరైన విధానం కాదన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు జగతి, వీరయ్య, ఫిరోజ్ దేశ్‌ముఖ్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : హాలియా మండల పరిధిలోని పులిమామిడి గ్రామ వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మండల పరిధిలోని జంగమయ్యగూడెం గ్రామంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నర్రా అంతిరెడ్డి తెలిపాడు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులైన వారందరికీ బీసీ రుణాలు ఇవ్వాలి

కనగల్ : అర్హులైన వారందరికీ బీసీ రుణాలు అందించాలని కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్, పగిడిమర్రి మాజీ సర్పంచ్ గోలి జగాల్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అర్హులందరికీ బీసీ రుణాలను అందిస్తామని చెప్పడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కిసాన్ సెల్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య

రామగిరి(నల్లగొండ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి సరిపడా విద్యుత్ అందిస్తుందని, పాడి పంటలతో రైతులు సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు. తిప్పర్తిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. అనంతరం జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, మిషన్‌భగీరథ సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : గ్రామాల సమగ్రాభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం మండలంలోని కలిమెర గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి బీసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ సారథ్యంలో అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అన్ని వర్గాల వారికి చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్మెర గ్రామానికి చెందిన పలుపార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.9లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, వైస్‌ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, సర్పంచ్ పిన్నపురెడ్డి నర్సిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఎంపీటీసీ ఎడ్ల పురుషోత్తంరెడ్డి, ఉపసర్పంచ్ వెంకటాచారి, సింహాద్రి, యాదయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఫీడర్‌చానల్‌కు తక్షణమే మరమ్మతులు



నెవిళ్లగూడెంలో శేశిలేటి ఫీడర్ చానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నాంపల్లి : మండలంలోని శేశిలేటివాగు ఫీడర్ చానల్ మరమ్మతు పనులను ప్రారంభించి నాంపల్లి చెరువు, పెద్దాపురం చెరువులకు నీరందిస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేవిళ్లగూడెం, దామెర గ్రామాల మధ్య ఉన్న శేశిలేటివాగును శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో వాగు నీరు వృథాగా పోకుండా ఫీడర్ చానల్ పనులు రూ.25లక్షలతో మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఇడికూడ నుంచి కొండమల్లేపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తారని తెలిపారు. అనంతరం 11మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2లక్షల 50వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, పోగుల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, యాదమ్మసైదులు, విష్ణువర్ధన్‌సాగర్, మాల్ మార్కెట్ డైరెక్టర్లు కడారి శ్రీశైలం, యాదయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కోర్టు, కలెక్టర్ బంగ్లా, స్కాట్‌హాల్, ప్రకాశంబజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాలకార్మిక నిర్మూలనకు కృషి చేయాలి

మర్రిగూడ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ చైల్డ్ హెల్ప్‌లైన్ ముస్కాన్ టీం సభ్యులు మండల కేంద్రంలో పలు షాపుల్లో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా శంకర్‌నాయక్

మర్రిగూడ : మర్రిగూడ సీహెచ్‌సీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కరెంటోతు శంకర్‌నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

ఏడు ట్రాక్టర్లు, రెండు జేసీబీలపై కేసు నమోదు

మునుగోడు : మండలంలోని కొంపల్లి గ్రామ పెద్దచెరువు నుంచి అక్రమంగా ఒండ్రుమట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు, రెండు జేసీబీలతో పాటు డ్రైవర్లపై మండల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. చెరువు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తుండగా ఈ విషయాన్ని గ్రామానికి చెందిన పలువురు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అడ్డుకొని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఐబీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

చిట్యాల : అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఉరుమడ్ల గ్రామస్తులు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పామనుగుళ్ల అచ్చాలు, ఐతరాజు నర్సింహ, బెలిజ మల్లయ్య, పి.నరేష్, లోడె విష్ణుమూర్తి, కిరణ్, యాదయ్య, లక్ష్మి, సువర్ణ, యాదమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అంబడిపూడి జయంతి

చండూరు : మండల కేంద్రంలో సాహితీ మేకల సంస్థ ఆధ్వర్యంలో కవి, రచయిత అంబడిపూడి వెంకటరత్నం 115వ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భిక్షమయ్య, సుధీర్‌బాబు, గంగాధర్, లక్ష్మీనారాయణ, వెంకన్న, హరికిషన్, ఉన్నారు.

పంచాయతీ కార్మికులపై కక్ష సాధింపు తగదు

నల్లగొండ రూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగదని సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జీపీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు మద్దతుగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాములు, ఎల్లేష్, నాగమణి, అనిల్ పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు బొల్లెద్దు నాగరాణిఅంబేద్కర్, వెంకన్న, ఎంపీటీసీ మట్టయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సమ్మెలో ఆ సంఘం మండల అధ్యక్షుడు జిల్లా విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, కార్మికులు నర్సింహ, ముత్తయ్య, మరియమ్మ, చంద్రయ్య, పిచ్చమ్మ, యాదయ్య తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల వంటావార్పు

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు సమ్మె శిబిరం వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు ఏడాకుల కోటయ్య, ప్రధాన కార్యదర్శి జి.ఆశీర్వాదం, కార్మికులు మాందాసు సైదులు, లింగయ్య, వెంకటాచారి, చంద్రయ్య, జ్యోతి, శోభ, మంగమ్మ, భద్రయ్య, దేవయ్య, నరేందర్, పరమేష్ పాల్గొన్నారు.



నల్లగొండ రూరల్ : సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



కేతేపల్లిలో సమ్మె శిబిరం వద్ద వంటలు చేస్తున్న కార్మికులు

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి

నాంపల్లి : మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని మాహ్మదపురం గ్రామ సర్పంచ్ మల్గిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 10వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, నాంపల్లి నరేష్, కార్మికులు గాదేపాక మరియమ్మ, వెంకటమ్మ, రామస్వామి పాల్గొన్నారు.

చండూరు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె శనివారం కొనసాగుతుంది. ఈ సమ్మెకు కేవీపీఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ట శివకుమార్, మొగుదాల వెంకటేశం, కార్మికులు సుజాత, దాసు, భిక్షమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మునుగోడు : గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి నెలకు రూ.19,500ల వేతనాలు చెల్లించాలని మాలమహానాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బెల్లం బాలశివరాజు డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య, అద్దంకి రామలింగం, వెంకట్, మల్లేష్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మర్రిగూడ : రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె పదోరోజుకు చేరుకోగా ఆయన వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఏర్పుల యాదయ్య, లింగయ్య, మంజుల, రాములు, ముత్తమ్మ, మహేష్, యాదగిరి పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం అందించాలి



కనగల్ : మాట్లాడుతున్న ఎంపీపీ కరీంపాష

కనగల్ : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులోకి ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ కరీంపాష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ వరూదిని, ఎస్‌ఏ వెంకటకృష్ణ, పీహెచ్‌ఎన్ రజిని, హెచ్‌ఎస్ వెంకటేశం, పద్మ, సిబ్బంది తదితరులున్నారు.

చిట్యాల : ఆరోగ్య సిబ్బంది పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ కొలను సునీత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మర్ల అలివేలు రాంరెడ్డి, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, వైద్యాధికారి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి

నల్లగొండ : రాజకీయ పార్టీల నాయకులు త్వరగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ, ఓటరు నమోదు అధికారి ఎస్.రవి సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ వారం రాజకీయ పార్టీల సమావేశం నిర్వహిస్తామని అందులో భాగంగా ఈరోజు కూడా నియోజకవర్గ స్థాయి పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. బీఎల్‌ఓలు గత నెలలో జరిపిన హోం టూ హోం సర్వే గురించి తెలియజేసి అందులో వచ్చిన ఫామ్స్ ప్రాసెసింగ్ గురించి వివరించారు. క్లెయిమ్స్ ఫామ్ 6,7,8 లకు సంబంధించిన జాబితాలు ఫామ్ 9,10,11,11ఏ 11బీలను అందజేసి అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ, పాల్గొన్న నాయకులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌కె.ఆరీఫ్

నకిరేకల్ : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని నకిరేకల్ మెజిస్ట్రేట్ ఎస్‌కె ఆరీఫ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో మండల సేవా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు స్నేహపూరితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయ్యవాదులు పూజర్ల శంభయ్య, పోతుల మల్లయ్య, ప్రకాష్‌రావు, మంగ సైదులు, సోమయ్య, గఫూర్, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ వి.శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు సత్తయ్య మృతికి సంతాపం

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ పుట్ట సత్తయ్య (68) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహంపై పార్టీ జిల్లా నాయకులు కందాల ప్రమీల, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. అదే విధంగా ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ నేత దైద రవీందర్, ఏపీఎం విద్యాసంస్థల అధినేత పాపిరెడ్డి, వివిధ పార్టీ నేతలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతేపల్లి : పత్తి పంటలో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవాలని మండల ఏఓ బి.పురుషోత్తం సూచించారు. మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన పత్తి పంటలను, యంత్రంతో కలుపు తీసే విధానాన్ని శనివారం ఆయన పలువురు రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పత్తిలో గడ్డి, వెడల్పాటి ఆకులు గల కలుపును గుర్తిస్తే ఎకరాకు 400మి.లీ క్విజలోఫోస్ ఇథైల్, 250 మి.లీ పైరితాయో బ్యాక్ మందును 200 నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగు నివారణకు ఒక లీటరు నీటికి 1.6 మి.లీ. మోనోక్రోటోఫోస్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సైదులు, వెంకన్న, రాము, లక్ష్మణ్, ఫణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల సంబరాలు



నల్లగొండ పట్టణంలోని నారాయణ పాఠశాలలో నిర్వహించిన బోనాల సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నల్లగొండలోని శ్రీ సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పోతరాజు, అమ్మవారు, పులి వేషధారణతో విద్యార్థులు